సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com


# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 126 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 10.09.2025

## గ్రూప్-1పై హైకోర్టు సంచలన తీర్పు

2





# భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

- 152 ఓట్ల మెజార్టీతో గెలుపు
- అభినందించిన ప్రధాని మోడీ

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తమిళనాడు నేత సీపీ రాధాకృష్ణన్ భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 781 మంది సభ్యులకుగాను 767 మంది పార్లమెంట్ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాధాకృష్ణన్ కు 452 ఓట్లు, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. 152 ఓట్ల మెజార్టీతో రాధాకృష్ణన్ గెలుపొందారు. కమలం పార్టీకి దశాబ్దాలుగా సేవలు అందించిన చరిత్ర ఆయనకు ఉంది. పార్టీకి అత్యంత నమ్మకస్తుడిగానూ పేరుంది. ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలువగా.. ఆయన అందరూ ఊహించినట్లుగానే విజయం సాధించారు. 1957లో జన్మించిన ఆయన.. కాలేజీ సమయంలో టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ గా నిలిచారు. పుదుచ్చేరి, తెలంగాణ, మహా రాష్ట్ర గవర్నర్ గానూ రాధాకృష్ణన్ పనిచేశారు.



## పిల్లలకు పోషకాహారం అందించాలి

- అంగన్‌వాడీల నిర్వాహణ సరిగా ఉండాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

3 లో



wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# గ్రూప్1పై హైకోర్టు సంచలన తీర్పు

- **జనరల్ర్యాంకింగ్‌లిస్టును రద్దు**
- **మళ్లీ మూల్యాంకనం చేయాలని ఆదేశం**
- **సాధ్యంకానిపక్షంలో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని స్పష్టం**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** గ్రూప్ 1 పరీక్షపై హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గ్రూప్ 1 ఫలితాల్లో ప్రకటించిన జనరల్‌ర్యాంకింగ్‌లిస్టును రద్దు చేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం.. మెయిన్స్‌పరీక్ష పేపర్లను మళ్లీ మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. రీవాల్యుయేషన్‌ఆధారంగా ఫలితాలు వెల్లడించాలని సూచించింది. పునఃమూల్యాంకనం సాధ్యం కాకపోతే ఎనిమిది నెలల్లో మళ్లీ మెయిన్స్‌పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌అయిన అభ్యర్థులకు చుక్కెదురైనట్లయింది. గ్రూప్ 1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షల నిర్వహణను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటీషన్లపై జూలై 7న వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్‌చేసింది. 2023 అక్టోబర్21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్ 1 మెయిన్స్‌పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ ఈ ఏడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది సెలెక్ట్‌కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదంపై సుదీర్ఘ విచారణ జరిపిన జస్టిస్‌నామవరపు రాజేశ్వరరావు తన తీర్పును వాయిదా వేస్తున్నట్టు జూలై 7న ప్రకటించారు. తాజాగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా రీవాల్యుయేషన్‌జరిపించాలని టీజీపీఎస్సీని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.



## సైకిల్ పంపిణీ సక్సెస్ ఫుల్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భారత ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు మరియు కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సైకిల్ పంపిణీ కార్యక్రమం ఈరోజు భీమదేవరపల్లి మండలం, ఉమ్మడి మాణిక్యాపూర్‌లోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు అందించడం ద్వారా విద్యాభివృద్ధికి తోడ్పడడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని, గ్రామస్థాయిలో విద్యపై అవగాహన పెంచాలని తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ప్రశంసనీయమని గ్రామ నాయకులు అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటం ద్వారా వారి చదువు మరింత సులభతరం అవుతుందని పాల్గొన్నవారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రామోజీ శ్రీనివాస్, మండల సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, వేణు, తీగల రాజు, సదానందం, బొజ్జపురి పృథ్వీ, తీగల రాజు గౌడ్, మాణిక్యాపూర్ బూత్ అధ్యక్షుడు రామారపు భద్రయ్య, అర్జున్, గణేష్, కార్తీక్, అజయ్, చింతల వేణు, జిల్లా పరిషత్ హై స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మట్టెవాడ పీఎస్‌లో సీపీ తనిఖీలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం మట్టెవాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ కు అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రెసెప్షన్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పనితీరుతో పాటు, పోలీస్ స్టేషన్ లో అత్యధికంగా నమోదు అయిన కేసులు, స్టేషన్ పరిధిలోని కాలనీల వివరాలను పోలీస్ కమిషనర్ ఇన్స్ స్పెక్టర్ కరుణాకర్ ను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏ ఎస్పీ శుభం వున్నారు.





## ముల్కనూరులో ఉద్రిక్తత

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో మంగళవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయాలని బిజెపి పార్టీ నాయకులు యత్నించగా, పోలీసులు తక్షణమే అడ్డుకున్నారు. దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకొని పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో పెట్టగా, ఆ సమయంలో బొమ్మ నుంచి పొగ వ్యాపించి వాహనంలో ఉన్న ఇతర సామగ్రిపై ప్రమాదం జరిగే పరిస్థితి ఏర్పడింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బొమ్మను బయటకు తీసి నీళ్లు చల్లి చల్లార్చడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన నేపథ్యంలో జిల్లా బిజెపి నాయకుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. "లక్ష అబద్ధాలను చెప్పి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడం లేదు. అందువల్లే యూరియా వంటి అత్యవసర ఎరువుల లభ్యతలో రైతులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దేశ రాజధానికి పర్యటనలు చేసి ప్రచారం చేసుకోవడమే తప్ప, రైతుల సమస్యలపై ప్రభుత్వం ఏనాడు శ్రద్ధ చూపలేదని" అన్నారు. కార్యక్రమానికి మండల బిజెపి అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు దొంగల కోంరయ్య, దుర్గాసింగ్, ఊసకోయిల కిషన్, సదానందం, రాజేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

**మద్దూరు, మన చౌరాస్తా :** మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన ఏలూరి బాలవ్వ కుమారుడు ఏలూరి సాయిరాం ఇటీవల విద్యుత్ షాక్ తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మంగళవారం అక్కడికి చేరుకొని సాయిరాం చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

## చెరువు మత్తడి పునరుద్ధరణ

- **హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు**

**పాలకుర్తి, మనచౌరాస్తా :** పాలకుర్తి మండలం జె.తొర్రురులో నాలుగేళ్లుగా చెరువులో నీరు నిల్వ లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సహకారంతో ఇటీవల ఇర్రిగేషన్ శాఖ నిధులు రూ.17 లక్షలతో మత్తడి మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేశారు. 4L కెనాల్ నుండి నల్లకుంట మీదుగా నీరు చెరువులోకి చేరగ.. నిండిపోయి పునరుజ్జీవం పొందింది. గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే చెరువును సందర్శించారు. గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించారు. సత్యనారాయణ, కుమారస్వామి, రాఘవరావు, యాకాంతరావు, భాస్కర్, మైసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్కూళ్లను తనిఖీ చేసిన వరంగల్ కలెక్టర్

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ ఆటోనగర్‌లోని గిర్మాజీపేట ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన అనంతరం విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, మెరుగైన విద్య బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్ఓ విజయలక్ష్మి, తహసీల్దార్ ఇక్బాల్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు భోపాల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.







# అంగన్‌వాడీల నిర్వహణ సరిగా ఉండాలి

- **పిల్లలు, గర్భిణులకు పోకాహారం అందించాలి**
- **జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా**

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** అంగన్వాడి కేంద్రంలో చిన్నారులు, గర్భిణులకు పౌష్టిక ఆహారం కోసం అందజేస్తున్న భోజనం కోడిగుడ్లు తాజాగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. చిన్నారులు పౌష్టిక ఆహారాన్ని ఇష్టంగా తినాలి.. అంగన్వాడీ కేంద్రంపై పిల్లల్లో ఇష్టత పెంచాలి.. అని ఆయన సూచించారు. మంగళవారం కలెక్టర్ దేవరుప్పుల మండలం పెద్దమదూరు గ్రామంలో విస్తృతంగా పర్యటించి జిల్లా పరిషత్ హై స్కూల్, అదే కాంపౌండ్ లో ఉన్న ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం ల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోని చిన్నారుల ను పలకరించారు. పౌష్టికాహారం కొరకు నిలువ చేసిన వస్తువులను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నారులు అమితంగా ఇష్టపడే పదార్థాలను గ్రహించి వాటిని అందచేసే విధంగా టీచర్లు కృషి చేయాలన్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఏర్పాటుచేసిన ప్రైమరీ స్కూల్ విద్యార్థుల ను పలకరించారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందినవా లేవా అని అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్ లో తరగతి గది ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు పరీక్షల సమయం సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలన్నారు. మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలనకై డిజిటల్ బోధనను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు.

అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలనకై గ్రామంలో పర్యటించి ఇండ్ల నిర్మాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగు ఇండ్లకు విద్యుత్ తీగల సమస్య ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత వివరాలను అడిగి తెలుసుకుంటూ సమస్య లను పరిష్కరిస్తామన్నారు. అలాగే ఇసుక, కంకర, స్టీలు ధరల నియంత్రణకు సంబంధిత యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని మండల అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్ణీత సమయంలోగా నిర్మించుకుంటేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారులకు తెలిపారు. కలెక్టర్ వెంట మండల అధికారులు తహసీల్దార్ ఆండాలు, ఎంపీడీవో సురేష్, ఎంఈఓ కళావతి, ఆర్ఐ రాజు, పంచాయతీ సెక్రటరీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ సేవలు చిరస్మరణీయం



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్షలోమ్ తో కలిసి కలెక్టర్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా కాళోజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమం లో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు


# ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి



నర్మెట, మన చౌరాస్తా: నర్మెట్ట మండలంలోని బొమ్మకూర్ ప్రాథమిక పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. సభకు పాఠశాల హెచ్ఎం మెరుగు రామరాజు అధ్యక్షత వహించగా విద్యాశాఖ అధికారి ఎం. ఐలయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం కీర్తి రమేష్ , పంచాయతీ కార్యదర్శి సుజాత, అంగన్వాడీ టీచర్ నాగమణి, గ్రామ పెద్ద సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాళోజీ రచనలు ప్రజలకు దిక్సూచి. విద్యార్థులు ఆయన చూపిన మానవతా మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**జూనియర్‌కాలేజీలో..**

జనగామలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి మాట్లాడుతూ రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో కాళోజీ దిట్ట అని 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరిపెల్ల రవిప్రసాద్, స్టూడెంట్ కౌన్సిలింగ్ ఆఫీసర్ డాక్టర్ వస్కుల శ్రీనివాస్, అధ్యాపకులు శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, వరుధిని, రజిత, గణేష్, ఇశ్రాత్ భాను, ముక్తాదిర్, నాగేందర్, కరుణాకర్ , ప్రియదర్శిని, రేఖ,శంకర్, షహనాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వాలు విఫలం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** డ్రగ్స్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విచ్చలవిడిగా అమ్ముడవుతున్నాయి. విద్యార్థులు, యువకులు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు కూడా వీటికి బానిసవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల నుండి డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు కూడా తక్కువ ఖర్చుతో లభిస్తున్న మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. గంజాయి వినియోగంతో యువత శారీరకంగా, మానసికంగా క్షీణించి, ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రమాదకరమైన డ్రైవింగ్ వల్ల ప్రాణనష్టాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. అలాగే, గొడవలు, హత్యలు, అత్యాచారాలు వంటి నేరాలకు కూడా ఇది దారి తీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యాసంస్థలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, మత్తు పదార్థాలు క్యాంపస్‌లోకి ప్రవేశించకుండా కట్టడి చేయాలని కోరారు. గంజాయి లేదా ఇతర డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థులు ఉన్నట్లు తేలితే ఆ కళాశాల అనుమతిని రద్దు చేసేలా నోటీసులు ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో పండుగలు, పెళ్లిళ్లు వంటి కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, దీంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి పెట్టాలని, వారితో సంభాషించి మంచి చెడు తెలుసుకోవాలని సూచించారు. చివరిగా, ప్రజల ఆరోగ్యం క్షేమంగా ఉండాలంటే డ్రగ్స్, గంజాయి, కల్తీ పదార్థాలను నిషేధిస్తూ కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ పక్షాన డిమాండ్ చేశారు.

## అభ్యసన సామర్థ్యాలు పెరగాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ, మన చౌరాస్తా :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపరిచే విధంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ లష్కర్ బజార్ లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య, సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఐదు, ఆరు, ఏడు తరగతులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు తెలుగు ఆంగ్లం గణిత పాఠ్యాంశాలను విద్యార్థులతో కలెక్టర్ చదివించారు. ఈ నెలలో నిర్వహించనున్న మిడ్లైన్ టెస్ట్ కు ఏవిధంగా సన్నద్ధమవుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ ను పరిశీలించి భోజనం ఎలా ఉంటుంది, మెనూ ప్రకారం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. డార్మెట్రీ ని కూడా పరిశీలించారు. వాటర్ సమస్య ఉండగా దాని గురించి వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పనిసరిగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, హనుమకొండ ఎంఈవో నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.








# జనగామ లయన్స్‌కు రాష్ట్ర అవార్డులు











**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో నివాసముంటున్న ఐదుగురు లయన్స్ నాయకులు కన్న పరశురాములు, క్రిష్ణ జీవన్ బజాజ్, చందుపట్ల రవీందర్ రెడ్డి, ఘజ్జురి జయహరి, డా. కె. రంజిత్ కుమార్ కు మల్టిపుల్ జిల్లా తెలంగాణ రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఉన్న 8 లయన్స్ జిల్లాల కౌన్సిల్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ లయన్ హన్మాండ్ల రాజి రెడ్డి అధ్యక్షతన సోమవారం రాత్రి కొంపల్లి కె వి ఆర్ కన్వెన్షన్ లో జరిగిన వేడుకలో లయన్స్ ప్రముకులు పూర్వ డైరెక్టర్లు డా. జి. బాబు రావు, ఆర్. సునీల్ కుమార్, 320ఎఫ్ తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి అవార్డులు ప్రదానం చేశారు. 202425 లయనిస్టిక్ సంవత్సరంలో వీరు చేసిన సేవలను గుర్తిస్తూ అవార్డులు ప్రదానం చేశారు. మల్టిపుల్ జిల్లా పరిధి మాగజైన్ విభాగం చైర్మన్ గా లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ చార్టర్ అధ్యక్షుడు పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు, జిల్లా క్యాబినెట్ లో అదనపు కార్యదర్శిగా, లయన్స్ బిజినెస్ నెట్వర్క్ కోఆర్డినేటర్ గా బాధ్యతలు నిర్వహించిన లయన్స్ క్లబ్ జనగామ పూర్వ అధ్యక్షుడు క్రిష్ణ జీవన్ బజాజ్, రీజియన్ చైర్మన్ గా పని చేసిన సూర్య క్లబ్ చార్టర్ అధ్యక్షుడు లయన్ చందుపట్ల రవీందర్ రెడ్డి, జోన్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించిన జనగామ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఘజ్జురి, జనగామ కింగ్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డా. కె. రంజిత్ కుమార్ మల్టిపుల్ ఫేస్ అవార్డులు లభించాయి. వీరికి మల్టిపుల్ జిల్లా స్థాయి అవార్డులు లభించడం పట్ల స్థానిక క్లబ్ ల నాయకులు హర్షం వ్యక్తం

# ఉపాధి కూలీల వివరాల ఆన్‌లైన్‌లో..



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా, సామర్థ్యంగా నిర్వహించేందుకు కొత్త ప్రయోగాన్ని ప్రారంభించింది. పైలట్ ప్రాజెక్టుగా హనుమకొండ, కరీంనగర్ జిల్లాల్లో ఉపాధి హామీ కూలీల వివరాలను పూర్తిగా డిజిటల్ రూపంలోకి మార్చి, ఆన్‌లైన్‌లో అనుసంధానించే ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో భీమదేవరపల్లి మండల కేంద్రంలో మంగళవారం రోజున కూలీల వివరాల నమోదు పనులను మండల ఉపాధి హామీ అధికారి కుమార్ స్వామి పరిశీలించారు. మండలంలో మొత్తం 8,394 జాబ్ కార్డులు ఉండగా, వాటిలో 16,164 మంది కూలీలు నమోదు చేయబడ్డారు. అయితే ఇప్పటివరకు 9,114 మంది మాత్రమే పని దినాలను వినియోగించుకుంటున్నారు. డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లో కూలీల పనిదినాల నిర్వహణ, వేతన చెల్లింపులు, పని ప్రదేశాల ట్రాకింగ్‌ను మెరుగుపరచేందుకు ఈ ఆన్‌లైన్ అనుసంధాన ప్రక్రియ కీలకంగా మారనుంది. ఏపీవో కుమార్ స్వామి మాట్లాడుతూ "కూలీల గుర్తింపును మరింత విశ్వసనీయంగా, సులభంగా చేయడం కోసం ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని ఉపయోగిస్తున్నాం. ఈనెల 30 లోపు కూలీల వివరాలను పూర్తిగా ఆన్లైన్లో నమోదు చేసి, పనిదినాల వినియోగాన్ని సక్రమంగా పర్యవేక్షిస్తాం. ఉపాధి హామీ పనుల్లో మిగిలిన కూలీలను కూడా నమోదు చేసేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తాం" అని తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే నాగరాజు అండ

**హనుమకొండ, మన చౌరాస్తా :** ఆపదలో బాధిత కుటుంబానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అండగా నిలిచారు. హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని చింతగట్టు గ్రామానికి చెందిన మాచర్ల నిహార్ష్ రక్త కణాల సమస్య (ఫ్యాక్టర్ 13 డెఫిషియన్సీ) సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి లో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5,00,000 ఎల్ఓసి కాపీని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నిహార్ష్ తండ్రి మాచర్ల భాస్కర్‌కు అందజేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు వైద్య విషయంలో అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాచర్లభాస్కర్ దేవి ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు బర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# యుఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయండి

**హనుమకొండ, మన చౌరాస్తా:** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీలలో హనుమకొండ పట్టణంలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మనోజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే, డీఈఓ, ఎంఈఓ, కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని పేర్కొన్నారు. జిల్లా మహాసభలను విజయవంతం చేయడానికి విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు పెద్ద ఎత్తున తరలిరావాలని మనోజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మనోజ్, రమేష్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ మోడల్ స్కూల్లో తెలంగాణ భాషా దినోత్సవం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ముల్కనూర్ మోడల్ స్కూల్లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యక్రమాన్ని మరింత అందంగా అలంకరించారు. 8వ తరగతి విద్యార్థిని సంకీర్తన రాణి రుద్రమదేవి పాత్రలో, 10వ తరగతి విద్యార్థిని బ్లెస్సి తెలంగాణ తల్లి పాత్రలో ఏకపాత్రాభినయం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. మాతృభాషపై ప్రేమను పెంపొందించాలనే సందేశంతో తొమ్మిదవ, పదవ తరగతి విద్యార్థులు వేరువేరు నాటికలు ప్రదర్శించి, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను ఆలోచింపజేశారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ ముజిబూర్ రెహమాన్, తెలుగు అధ్యాపకులు పరకాల శ్రీనివాస్, చేరాల రామన్, అన్వర్ పాష్ మరియు మిగతా అధ్యాపక బృందం హాజరై విద్యార్థులను అభినందించారు. అలాగే వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి వారిని ప్రోత్సహించారు.

